సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

పైడితల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

గోపాలపట్నం: శ్రావణ మాసం సందర్భంగా గోపాలపట్నం ప్రశాంతినగర్‌లోని పైడితల్లి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అధిక సంఖ్యలో మహిళలు హాజరై మంగళ గౌరీ వ్రతంలో పాల్గొని కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

భక్తిశ్రద్ధలతో మంగళ గౌరీ వ్రతం



పూజలందుకున్న మంగళగౌరీ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెంలోని మురళీకృష్ణ ఆలయంలో శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని మంగళగౌరీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసుదేవ అన్నమయ్య సంకీర్తన సంస్థానం ఆధ్వర్యంలో నీలాతి వెంకట గుణవతియాదవ్ పర్యవేక్షణలో నిర్వహించిన వ్రతాల్లో పారిశ్రామిక ప్రాంత నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని మంగళగౌరీ వ్రతాన్ని ఆచరించారు. సౌభాగ్యం నిలపాలని,తమ ఇంట సిరులు కురిపించాలని పూజించారు.అనంతరం వాసుదేవ అన్నమయ్య సంకీర్తన సంస్థానానికి చెందిన మహిళలు కోలాట ప్రదర్శన,లలిత,విష్ణు పారాయణాలను పఠించారు.

విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ




పుస్తకాలు, స్టేషనరీ అందుకున్న విద్యార్థులతో ఎంఈవో దివాకర్, ట్రస్ట్ సభ్యులు

గోపాలపట్నం: శ్రీదేవి విజ్ఞాన జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 92వ వార్డు ఎస్సీబీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఎంఈవో దివాకర్, ట్రస్ట్ ఫౌండర్ కీర్తి పట్నాయక్ పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఇలాంటి కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ క్రీర్తి పట్నాయక్, డాక్టర్ శ్రీపట్నాయక్, పాఠశాల హెచ్‌ఎం జి. కామరాజు, సీడీపీవో నీలిమ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం పరిధిలో జీవీఎంసీ నిధులతో జరుగుతున్న సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణ పనులను మంగళవారం వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌తో పాటు ఏఎంసీ డైరెక్టర్ పోతాబత్తుల శ్రీనివాస్ పరిశీలించారు. నాణ్యతలోపం లేకుండా పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

విద్యార్థుల వికాసానికి చిరునామా



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు తదితరులు

కంచరపాలెం: నూతన విద్యావిధానం అమలు చేసి 5 వసంతాలు పూర్తయిన సందర్భంగా కేంద్రీయ విద్యాలయాలను పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాలుగా నామకరణం చేసి జాతికి పునరంకితం చేశారు. ఈ కార్యక్రమ నిర్వహణకుగాను తెలుగు రాష్ట్రాల నుండి కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో గల కేంద్రీ విద్యాలయం-1 విజయనగర్‌ను ఎంపిక చేశారు. దీని పేరును కూడా మార్చారు. దీంతో ఇదిప్పుడు పీఎం శ్రీకేంద్రీయ విద్యాలయం-1గా మారింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.గణబాబు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యాలయాన్ని జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వికాసానికి కేంద్రీయ విద్యాలయాలు చిరునామా అని అభివర్ణించారు. ఈ సందర్భంగా అండర్-14 హ్యాండ్ బాల్ విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కేవి-1 ప్రిన్సిపాల్ జి.కిషోర్, హెడ్‌మాస్టర్ ఎం.మాలిక్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇవేం పనులు!

- రూ.1.90 కోట్లతో ఎన్ఎస్‌టీఎల్ 80 అడుగుల రోడ్డు సుందరీకరణ
- ఒక వైపు నిర్మాణం.. మరో వైపు తవ్వకం
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ శూన్యం



వేసిన రోడ్డును అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ నిర్మాణం కోసం తవ్వేస్తున్న దృశ్యం



ఇళ్ల ముందు అసంపూర్తిగా పనులు



బుచ్చిరాజుపాలెం శివాలయం ముందు వేసిన టైల్స్‌పై ద్విచక్ర వాహనాల పార్కింగ్



అస్తవ్యస్తంగా ఇంటర్‌లాక్ టైల్స్ ఏర్పాటు

విశాఖ విద్య: అభివృద్ధి పేరిట ప్రభుత్వ నిధులు కొల్లగొడుతున్నారు. ప్రణాళిక లేకుండా పనులు చేపట్టి ప్రజాధనం వృథా చేస్తున్నారు. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో పనులు ఇష్టారీతిన చేపడుతున్నారు. దీనికి నిదర్శనంగా ఎన్ఎస్‌టీఎల్ 80 ఫీట్ రోడ్డు సుందరీకరణ పనులను చెప్పవచ్చు. ఇక్కడ పనులు సాగుతున్న తీరు చూసిన వారు నివ్వెరపోతున్నారు. ఇవేం పనులని నిట్టూరుస్తున్నారు.

విశాఖ విద్య

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నారు. అవకాశంఉన్న చోట దోచుకోవడానికే పెద్దపీట వేస్తున్నారు. దీనిలో భాగంగా రహదారులు, డ్రైనేజీలు, కొండవాలు ప్రాంతాల్లోని రక్షణ గోడల నిర్మాణం వంటి పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. ప్రజాధనాన్ని కూటమి నాయకులు, కాంట్రాక్టర్లు తిలా పాపం తలా పిడికెడు అన్న చందాన పంచేసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ విషయం

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా హైవే నుంచి సింహాచలం రోడ్‌ను కలుపుతూ ఎన్ఎస్‌టీఎల్ పక్క నుంచి కుమారి కల్యాణ మండపం వరకు 80 అడుగుల మేర రోడ్డు విస్తరించాల్సి ఉంది. జీవీఎంసీ 90వ వార్డు పరిధిలో పనులు పూర్తయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా చెట్లు నాటడం, ఎన్ఎస్‌టీఎల్ ఫ్యామిలీ గేటు నుంచి వంశీ సూపర్ మార్కెట్ వరకు రహదారి మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేసి మొక్కలు సైతం నాటారు. ఇదే చోట తాజాగా రూ.1.90 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులతో సుందరీకరణ పనులు చేస్తున్నారు.

ప్రణాళిక ఇలా..

ఎన్ఎస్‌టీఎల్ ఫ్యామిలీ గేటు నుంచి వంశీ సూపర్ మార్కెట్ వరకు రోడ్డుకు ఇరువైపులా సైడ్ బెర్మ్‌ను పటిష్టం చేసి వాటిపై ఇంటర్‌లాకింగ్ టైల్స్‌తో ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. రహదారి మధ్యలో ఇప్పటికే ఉన్న డివైడర్లను మరికొంత ఎత్తు పెంచి వాటికి గ్రిల్స్‌తో పాటు మధ్యలో మొక్కలు నాటేలా పనులు చేస్తున్నారు. అవసరమైన చోట రోడ్డుపై మళ్లీ బీటీ వేస్తారు. సింహాచలం వెళ్లేందుకు బీఆర్‌టీఎస్ రోడ్‌కు ప్రత్యామ్నాయ దారి కావడంతో ఆర్నెల్లలో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టారు. ఇంత వరకూ బాగున్నా పనులు జరుగుతున్న తీరు విమర్శలకు తావిస్తోంది.

సుందరీకరణ ఇలాగేనా

రహదారికి ఇరువైపులా ఇంటర్‌లాకింగ్ టైల్స్‌తో ఫుట్‌ఫాత్‌ల నిర్మాణం అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. కూటమి నాయకులు, వారికి సంబంధించిన ఇళ్లు ఉన్నచోట అడ్డదిడ్డంగా టైల్స్ వేస్తున్నారు. రోడ్డు మధ్యలో డివైడర్లలో ఉన్న చెట్లను నరికేసి మళ్లీ మొక్కలు నాటతామని గుంతలు తీస్తుండడంతో సుందరీకరణ అంటే ఇలాగేనా అంటూ పర్యావరణ వేత్తలు ప్రశ్నిస్తున్నారు.

సమన్వయం ఏదీ

రహదారి సుందరీకరణ పనులను రెండు నెలల కిందటే ప్రారంభించారు.అయితే ఇదో దారిలో ట్రాన్స్‌కో విభాగం ద్వారా ప్రస్తుతం అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్లు వేసే పనులు ప్రారంభించారు. రోడ్డుకు ఇరువైపులా సైడ్ బెర్మ్స్ వేసి వాటిపై టైల్స్ వేస్తున్నారు. అయితే ఆ వెనుకనే విద్యుత్ లైన్ కోసం రోడ్డుకు ఓ వైపు తవ్వుకుంటూ వస్తున్నారు.

> **పనులు నిలిపివేశాం**
>
> భూగర్భ పైపులైన్ల నిర్మాణం చేపట్టడంతో రహదారి సుందరీకరణ పనులు ప్రస్తుతానికి నిలివేశాం. వేసిన టైల్స్‌ను పైపులైన్ల కోసం తొలగిస్తున్నారు. మళ్లీ వారినే పూర్తి చేసి ఇవ్వాలని ట్రాన్స్‌కో పనులు చూసే వారికి తెలిపాం. ఫుట్‌ఫాత్‌ల నిర్మాణం పద్ధతి ప్రకారం జరిగేలా చూస్తాం.
>
> – ప్రవీణ్ కుమార్, జీవీఎంసీ డీఈ, జోన్-8

అంగన్‌వాడీ విద్యార్థులకు కిట్ల పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు కిట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి గొల్లకంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి శామ్యూల్ నేతృత్వంలో చిన్నారులకు విద్యా కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా నగర అంగన్‌వాడీ అధ్యక్షురాలు, వార్డు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి సాయిలత, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు పెద్దాడ జ్యోత్స్న పాల్గొని చిన్నారులకు కిట్లు అందజేశారు. వార్డులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యాక్టివ్ కార్యదర్శి పల్లా ఎర్నికుమార్ యాదవ్, వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీను, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆయా కుమారి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా న్యాయ సేవలు



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

విశాఖ-లీగల్: ప్రజలకు న్యాయ అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో విశాఖ ఉమ్మడి జిల్లాల జాగృతి యూనిట్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు న్యాయ సేవలను చేరువ చేయడమే జాగృతి పథకం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఉచిత న్యాయ సహాయం పొందే విధానం గురించి తెలిపారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అందించే టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్15100 ప్రాముఖ్యత గురించి తెలియజేశారు.

శ్మశాన వాటిక నిర్మాణానికి వినతి



కోరమాండల్ వద్ద గల హిందూ, క్రిస్టియన్ శ్మశాన వాటిక

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత పరిధిలో మరో శ్మశాన వాటిక ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ విశాఖ వెస్ట్ ఇన్‌చార్జి అతుకుమిశెట్టి రామచంద్రరావు మంగళవారం ఉదయం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. పారిశ్రామిక ప్రాంత పరిధి ఏడు వార్డుల్లో సుమారు 45 వేల మంది జనాభా ఉన్నారని, వీరిలో వారి కుటుంబ సభ్యులు మరణిస్తే 60వ వార్డు పరిధి కోరమాండల్ ఎదురుగా ఉన్న శ్మశాన వాటికి వద్దకు తీసుకెళ్లాల్సి వస్తుందన్నారు. ఆ శ్మశాన వాటికలో హిందూ, క్రిస్టియన్ల అంతిమ సంస్కారాలు నిర్వహిస్తుంటారన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న శ్మశాన వాటికి అంత సౌకర్యంగా లేదని, జీవీఎంసీ 62,63,40 వార్డుల ప్రజల సౌకర్యార్థం వారికి దగ్గరగా ఉండే 62 లేదా 63 వార్డుల పరిధిలోని ప్రభుత్వ స్థలంలో మరో శ్మశన వాటికి నిర్మించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని రామచంద్రరావు తెలిపారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

విశేషంగా గరుడసేవ: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి మంగళవారం గరుడసేవను ఆలయ బేడా మండపంలో ఉదయం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ జరిపి, విశేష హారతులిచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

వైద్యుల సూచన మేరకే మందులు వాడాలి



మాట్లాడుతున్న జిల్లా ఔషధ నియంత్రణ మండలి సహాయ సంచాలకుడు విజయ్‌కుమార్

అగనంపూడి: వైద్యుల సూచనల మేరకే యాంటీ బయోటిక్స్ వాడాలని జిల్లా ఔషధ నియంత్రణ మండలి సహాయ సంచాలకుడు ఎస్.విజయ్ కుమార్ అన్నారు. అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంళవారం యాంటీ బయోటిక్స్ వాడకంపై అవగాహన కల్పించారు. చిన్న చిన్న కారణాలతో అవసరానికి మించి మందులు వాడడం సరికాదన్నారు. వైద్యుల రాసిన చీటీ లేకుండా మందులు కొనడం, అమ్మడం నేరమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా వైద్యుల సలహా మేరకు మాత్రమే మందులు వాడాలన్నారు. జలుబు, దగ్గు వంటి వాటికి కూడా యాంటీ బయాటిక్స్ వాడడం అలవాటు చేసుకుంటున్నారని, ఇది సరికాదన్నారు. ఔషధ నియంత్రణాధికారి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా కోర్సు మొత్తం వాడాలన్నారు. సురక్షితమైన ఆహారం, శుద్ధి నీటిని వీటనియోగించడం వల్ల ఇన్ఫెక్షన్లు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఔషధ నియంత్రాధికారులు వి.అభిప్రియ, కె.కల్యాణి, కె.వి.భారతి, ఎస్.కల్యాణి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ వినియోగానికి సబ్సిడీ రుణాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, ఎస్ఈ శ్యామ్‌బాబు, ఈఈ నాయుడు

కంచరపాలెం: స్థానిక నేతాజీ ఫ్లైఓవర్ వద్ద ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మంగళవారం ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై ఏపీఈపీడీసీఎల్ కంచరపాలెం జోన్-2 ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని సదస్సును ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగదారులకు మేలు చేసే రీతిలో పలు రాయితీలు అందిస్తున్నాయని తెలిపారు. విద్యుత్ శాఖ ఎస్ఈ జి.శ్యామ్‌బాబు మాట్లాడుతూ ఈ పథకం వల్ల అతి తక్కువ కరెంట్ బిల్లు వస్తుందన్నారు. జోన్-2 విద్యుత్ విభాగం ఈఈ బి.కె.నాయుడు మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు సోలార్ ఏర్పాటుకు బ్యాంకుల నుంచి రాయితీతో కూడిన రుణాలు పొందవచ్చన్నారు. సోలార్ వినియోగంపై అతిథులు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి. సత్యనారాయణ, వార్డు కార్పొరేటర్ ఎస్.రాజశేఖర్, పుట్టా వాసు, ఏఈలు, సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులతో అప్రమత్తంగా ఉండండి

పెందుర్తి: 'మీ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న, నివాసం ఉంటున్న వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండండి. మంచిగా ప్రవర్తించి ముంచేసే వ్యక్తులు మీ చుట్టుపక్కలే చేరొచ్చు. వారితో జాగ్రత్తంగా ఉండాలి' అని సీఐ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. జీవీఎంసీ 97వ వార్డు కార్మికనగర్‌వాసులకు నేరాలు-చోరీలు-ఆన్‌లైన్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆన్‌లైన్ కార్యకలాలపై ప్రజలు తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. పిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వడం పూర్తిగా తగ్గించాలని సూచించారు. నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని కోరారు. కాలనీ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం నాగపంచమి పూజలను విశేషంగా నిర్వహించారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి మూల విరాట్‌కు పెద్ద ఎత్తున క్షీరాభిషేకాలు జరిపారు. విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి



తక్షణం స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట: కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు శంకరమఠం రోడ్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి మాట్లాడుతూ ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపుతున్న ట్రూ-అప్ విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు టీడీపీ గెలిస్తే విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక వాటిని భారీగా పెంచి ప్రజలపై భారం మోపడం అన్యాయమన్నారు. నారా లోకేష్ ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చి, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వాటిని పెట్టాలని ప్రజలపై ఒత్తిడి తేవడం దుర్మార్గమని వామనమూర్తి విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును, ట్రూ-అప్ చార్జీలను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తే ప్రభుత్వం తప్పక దిగివచ్చి వాటిని రద్దు చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో యు. శివాజీ, కె. దేవుడు, ఎం. నాగరాజు, భాస్కర్, సతీష్, నర్సింగరావు, రాజు, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ఉక్కు కేవీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థి ప్రార్థనను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వంశీకృష్ణ

ఉక్కునగరం: కేంద్రీయ విద్యాలయాల జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో స్టీల్ ప్లాంట్ కేవీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఇటీవల హర్యానాలోని అంబాలా, కేరళలోని తిరువనంతపురంలో జరిగి జరిగిన అండర్-17 బాలబాలికల వాలీబాల్ పోటీల్లో పాఠశాల విద్యార్థిని సి. సాయి ప్రార్థన ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకంతో పాటు రూ. 5 వేల నగదు బహుమతి గెలుపొందింది. అదే విధంగా అథ్లెటిక్స్ 400,100 మీటర్ల రిలే పోటీల్లో కార్తికేయ సాయి రజత పతకంతో పాటు రూ. 3 వేల నగదు బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలోవిజేతలను ప్రిన్సిపాల్ వంశీకృష్ణ, పీఈటీ సత్యనారాయణ అభినందించారు.

కాలుష్యం నివారించాలని వినతి



ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ ప్రతినిధులు

గాజువాక: గాజువాక నియోజకవర్గంలో పారిశ్రామిక కాలుష్య నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వైజాగ్ పోర్టు పొల్యూషన్ బాధిత గ్రామాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) కోరింది. ఈ మేరకు ఆ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు మంగళవారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. మింది, ములగాడ, అక్కిరెడ్డిపాలెం ప్రాంతాల్లో గాలి, నీటి నాణ్యత దారుణంగా పడిపోయాయని, దీనివల్ల స్థానికులు అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని పేర్కొన్నారు. వివిధ పరిశ్రమల నుంచి నిరంతరంగా వెలువడుతున్న హానికర వ్యర్థాలు స్థానికుల జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. కాలుష్య ప్రభావిత గ్రామాల ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు, చర్మ రుగ్మతలు, దీర్ఘకాలిక వ్యాధులు అధికమవుతున్నాయన్నారు. ఇలాంటి భయానక పరిస్థితుల్లో ఇక్కడి నివాస ప్రాంతాలకు 200 మీటర్ల దూరంలో సాన్వెరా గొడౌన్ ఏర్పాటుకు విశాఖపట్నం పోర్టు ట్రస్టు అనుమతి ఇచ్చిందని, ఇది తమ ప్రాంత ప్రజలను తీవ్ర కలవరానికి గురిచేస్తోందని వివరించారు. ఆ ప్రాంతంలో ఉద్యానవనం లేదా బొటానికల్ గార్డెన్‌ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో కార్పొరేటర్ గుడివాడ అనూష, జేఏసీ ప్రతినిధులు, నాయకులు పి.చిన్నారావు, ఎస్.అనంత లక్ష్మి, జి.లక్ష్మీనర్సింహ మూర్తి, ఎ.మురళీకృష్ణ, ఎ.కె.పాత్రో, విశ్వనాథం, వై.రామ్మోహన్, యజ్ఞ నారాయణ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలపై నిరసన



పరవాడలో ఆందోళన చేస్తున్న ఐద్వా సభ్యులు

పరవాడ: కరెంటు సర్దుబాటు చార్జీల భారాన్ని విద్యుత్ వినియోగదారులపై మోపడం సరికాదని అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం ఆక్షేపించారు. సర్దుబాటు చార్జీలను నిరసిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో పరవాడలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాణిక్యం మాట్లాడుతూ అధిక బిల్లులు వస్తున్న స్మార్ట్ మీటర్లను అమర్చడం మానుకోవాలని కూటమి ప్రభుత్వానికి హితవుపలికారు. వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు బిగిస్తే వాటిని పగులగొట్టాలని వినియోగదారులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు మన్యాల బంగారమ్మ, తుంపాల అన్నపూర్ణ, గోపాలరావు, లక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.